క్లుప్తంగా

ఆధార్ నవీకరణ ప్రత్యేక కేంద్రాలు ప్రారంభం



అంగర సచివాలయంలో ఆధార్ నవీకరణ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

కపిలేశ్వరపురం: మండలంలోని పలు సచివాలయాల్లో గురువారం ఆధార్ నవీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కోరుమిల్లి, అంగర–2 సచివాలయాల్లో సేవలను ప్రారంభించగా సమీప ప్రాంత ప్రజలు సేవలను వినియోగించుకున్నారు. కేంద్రాల పనితీరును ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. 23 నుంచి కపిలేశ్వరపురం–2, నల్లూరు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సేవలను ప్రారంభమవుతాయని ఎంపీడీఓ తెలిపారు.

పీహెచ్‌సీలో సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు



వాకతిప్ప పీహెచ్‌సీలో వైద్యసేవలపై చర్చిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: వాకతిప్ప పీహెచ్‌సీలో సదుపాయాల కల్పన కోసం పలు ప్రతిపాదనలు చేసినట్టు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి పి.చంద్రమౌళి, వైద్యుడు చిట్టూరి రాకేష్ చౌదరిలు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. కమిటీ సభ్యుల చర్చ అనంతరం ఆసుపత్రి డెలివరీ రూమ్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చాలని, ల్యాబ్ పరికరాలు, రసాయనాలు, పారిశుద్ధ్య సామగ్రిలను కొనుగోలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో ఆసుపత్రి ఎంపీహెచ్‌ఎస్ వీఎస్ కామేశ్వరరావు, మాచర సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఫార్మాసిస్ట్ జి.పద్మలత, సిబ్బంది బి.నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తి పాల్గొన్నారు.

ఫ్యామిలి ఫిజిషియన్‌తో మెరుగైన వైద్య సేవలు



అంగరలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంతో క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్య సేవలందుతున్నాయని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. గురువారం అంగర రాజమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 147 మంది రోగులను పరీక్షించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవి, రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వర్లు, జి.వెంకటలక్ష్మి, మేరీ తదితరులు సేవలందించారు.

దేవాలయ భూములకు రక్షణ కల్పించాలి

కాజులూరు: దేవాలయ భూములకు అధికారులు రక్షణ కల్పించాలని మండల బీజేపీ అధ్యక్షుడు సలాది వీరవెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంజేరులో గురువారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలాది ఎకరాల దేవాదాయ భూమి దశాబ్దాల తరబడి బినామీల పేరుతో ఉందని, కొందరైతే సదరు భూములను రొయ్యల చెరువులుగా మార్చేసి వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోతుల వీరబాబు, శంకరప్రియ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని శీలంవారిసావరం రోడ్డులో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజగోపాల్ సెంటర్, గ్యాస్ గొడౌన్ ఏరియా, సాయినగర్, తోటవారివీధి, కృత్తివెంటి గ్రౌండ్, డీఎస్పీ కార్యాలయం ఏరియా, పాత బస్టాండ్, సాయిబాబా గుడి, రాజబాబునగర్, వినాయక టెంపుల్ వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

రక్తహీనతకు చెక్ పెట్టేద్దాం

- విద్యార్థి దశ నుంచే మహిళల ఆరోగ్య పరిరక్షణ
- పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు
- అనీమియా ముక్త్ భారత్ పథకంలో భాగంగా మెరుగైన చికిత్స



నారాయణలంక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఈ రామారావు



కపిలేశ్వరపురంలో విద్యార్థి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మానవ జన్మకు సృష్టి కర్త అమ్మ. ఆ అమ్మ ఆరోగ్యం ఉండాలన్న లక్ష్యంతో చిన్న నాటి నుంచి ఆరోగ్య రక్షణకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా చిత్తశుద్ధితో తల్లుల ఆరోగ్య పరిరక్షణకు నిత్యం శ్రమిస్తుంది. ఫలితంగా పలు ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయి. మహిళల్లో రక్త హీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. రక్త హీనత నుంచి మహిళల్ని కాపాడేందుకు విద్యార్థి దశ నుంచి ఆరోగ్య మెరుగుదల కోసం అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో కొనసాగుతుంది. విద్యార్థినులతో పాటు మహిళలందరికీ రక్త పరీక్షలు చేసి రక్తహీనత నివారణకు ఈ పథకం ద్వారా కృషి చేస్తున్నారు.

అనీమియా ముక్త్ భారత్ పథకం లక్ష్యమిదీ

మహిళల్లో రక్తహీనత సమస్య పరిష్కారానికి పాఠశాలల్లోనే విద్యార్థినుల ఆరోగ్య వివరాలను సేకరించడం, అందుకు తగిన చికిత్సను అందించడం అనీమియా ముక్త్ భారత్ పథకం లక్ష్యం. రోజువారీ జీవితంలో మహిళలు తీవ్ర ఒత్తిడికి గురి కావడం, ఇతర ఆరోగ్య సమస్యలకు గురి కావడం తరచూ జరుగుతుంది. అలాంటి వాటి నుంచి బయటపడేందుకు పాఠశాలనే వేదికగా చేసుకుని ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో విద్యార్థులిలా

మండపేట మండలంలో 68 ప్రభుత్వ పాఠశాలలుండగా 7,709 మంది విద్యార్థులున్నారు. కపిలేశ్వరపురంలో 51 పాఠశాలల్లో 4,043, రాయవరంలో 46 పాఠశాలల్లో 3,873, రామచంద్రపురంలో 84 పాఠశాలల్లో 7,553, కె.గంగవరం మండలంలో 76 ప్రభుత్వ పాఠశాలల్లో 5,014 , మొత్తం 325 పాఠశాలల్లో 28,192 మంది విద్యార్థులున్నారు. వీరిలో 25 శాతం మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు..

సచివాలయ ఆరోగ్య కార్యకర్త, ఆశ కార్యకర్తలు అధికారులు నిర్దేశించిన పాఠశాలకు వెళ్ళి విద్యార్థి ఆరోగ్య వివరాలను సేకరిస్తారు. వాటిని ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు. విద్యార్థిని ఎత్తు, బరువు, హెమోగ్లోబిన్ శాతం, వినికిడి సామర్థ్యం, కంటి దృష్టి వివరాలను నమోదు చేస్తారు. సమస్య ఉన్న విద్యార్థినులను పీహెచ్‌సీ వైద్యులు పరీక్షిస్తారు. అవసరం మేరకు రక్త పరీక్ష చేస్తారు. రక్త హీనత కలిగిన వారిని గుర్తించి ప్రత్యేకమైన చికిత్సను అందిస్తారు. హెమోగ్లోబిన్ మాత్రలను ఇవ్వడం ద్వారా తాత్కాలికంగా సమస్య నుంచి బయటపడేస్తారు. శాశ్వత పరిష్కారానికి పౌష్టికాహారాన్ని అందిస్తూ విద్యార్థిని ఆరోగ్య స్థాయిని మెరుగుపరుస్తారు. 10 నుంచి 19 ఏళ్ళ వయసున్న విద్యార్థినులను పరీక్షించగా చిరుతిళ్ళు వల్ల ఉన్నత పాఠశాల విద్యార్థినుల్లో రక్త హీనత అధికంగా ఉంటున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు.

విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పాఠశాలల్లో రక్త పరీక్షల ద్వారా రక్తహీనత సమస్య ఉన్నవారిని గుర్తించాం. సమస్య పరిష్కారం కోసం ఆహారంలో ఆకుకూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తపడాలి. మోతాదుకు తగినట్టు మాంసాహారాన్ని అందిస్తుండాలి. పెద్దవారు రక్తిహీనత సమస్య పరిష్కారం కోసం ఆహారంతో పాటు జీవనశైలిలో సైతం మార్పులు చేసుకోవాలి.
– పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

అలరించిన స్టాంపుల ప్రదర్శన



పోస్టల్ స్టాంపులను అందిస్తున్న హెడ్ పోస్ట్‌మాస్టర్ విఠల్‌నాథ్

రామచంద్రపురం: స్థానిక ప్రధాన తపాల కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఫిలాటికల్ ప్రదర్శన(పోస్టల్ స్టాంపుల ప్రదర్శన) అలరించింది. పట్టణానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు, స్టాంపుల సేకరణ హ్యాబీ కలిగిన ఫిలాటికల్స్ పాల్గొని ప్రదర్శనలో ఉంచిన అరుదైన స్టాంపులను కొనుగోలు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శన గురువారంతో ముగిసింది. హెడ్ పోస్ట్‌మాస్టర్ విఠల్‌నాథ్ ప్రదర్శన వద్ద స్టాంపులను అందజేశారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్‌సీస్ ఆర్.శ్రీనివాసరావు, తపాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కీర్తి స్పందన, డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలెం, తోటపేట, వెల్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టుల భర్తీకి గురువారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలను రామచంద్రపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ.శాంతి, మండల ప్రజాపరిషత్ ఏఓ చాగంటి వెంకట అచ్యుత రామ సుబ్రహ్మణ్యంలతో కలిసి ఎంపీడీఓ కీర్తి స్పందన నిర్వహించారు. మొత్తం ఏడు దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు నలుగురే హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు.

పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న పలువురిని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం పరామర్శించారు. అంగరలో ముత్తా సత్తిబాబు, సిద్ధిరెడ్డి చంద్రావతిలతో పాటు మాచర, నల్లూరు, వల్లూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లోని పలువురు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ళ కలిసి ఓదార్చారు.

పొలంబడితో సాగు పద్ధతులపై అవగాహన



వెదురుమూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రమేష్‌కుమార్



నెలపర్తిపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంతో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కలుగుతుందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. వెదురుమూడి గ్రామ శివారు వ్యవసాయక్షేత్రంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి ద్వారా విత్తనం నాటిన నాటి నుంచి కోత వరకూ రైతుకు అండదండగా వ్యవసాయాధికారులు నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతులు ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవడానికి పొలంబడి ఉపయోగపడుతుందని ఏఓ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతామహాలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అప్పారావు

మండపేట: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టొచ్చని పట్టణ సీఐ పి.శివగణేష్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్ వద్ద ఆటో, వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ శివగణేష్, ఎస్ఐ కోన అప్పారావు, మండపేట ఎంవీఐ నాగేశ్వరరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిమిత వేగంతో ఆటోలను నడపడం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ముందు సీట్లలో ప్రయాణికులను కూర్చోబెట్టుకోకూడదని ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, వాహన రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ టీవీ రమణరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు దుర్గారావు, సంధాని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు యోగాపై శిక్షణనిస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యోగా, వ్యక్తిత్వ వికాసంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం డి.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం చాలా ముఖ్యమన్నారు. మానవతా యువ నాయకత్వ శిక్షణ శిబిరానికి 12 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయులు సీహెచ్‌వీ శ్రీరామచంద్రమూర్తి, ఆర్ఎస్ఆర్ఎస్ బాబా, కె.శ్రీనివాస్, ఎన్ఎస్ఎన్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

‘దిశ’ షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



పసలపూడిలో ‘దిశ’ షార్ట్ ఫిల్మ్‌కు క్లాప్ కొడుతున్న సూర్యనారాయణ

రాయవరం: మండలంలోని పసలపూడిలో ఆర్జీఎం ఎంటర్‌టైన్‌మెంట్‌పై కర్రి భాస్కరరెడ్డి నిర్మిస్తున్న ‘దిశ’ షార్ట్ ఫిల్మ్ గురువారం ప్రారంభమైంది. స్థానిక లాకుల వద్ద ప్రారంభమైన షూటింగ్‌ను గాదంశెట్టి సూర్యనారాయణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ప్రజల్లో దిశ యాప్‌పై అవగాహన పెంచేందుకు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు కర్రి రామారెడ్డి తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో హీరోగా నల్లమిల్లి శివారెడ్డి, నటీనటులుగా యాపిల్‌బాబు, వైజాగ్ జాను, జూనియర్ మురుగదాస్, సుబ్రహ్మణ్యం మాస్టారు నటిస్తుండగా, ఎస్‌వీ కృష్ణారెడ్డి సహ దర్శకుడిగా పనిచేస్తున్నారు.

గ్రామాల్లో వివేకానంద స్ఫూర్తి యాత్ర



కె.గంగవరంలో స్ఫూర్తి యాత్ర

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద స్ఫూర్తి యాత్ర సాగింది. గంగవరం నుంచి సత్యవాడ వరకూ సాగిన యాత్రలో నిర్వాహకులు అల్లూరి శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక కాలానికి అనుగుణంగా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. మానవతా విలువలతో కూడిన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కొడవటి ప్రసాద్ చౌదరి, వి.రాజశేఖర్, సీహెచ్.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణమూర్తి, గోపి, ఏడుకొండలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మండపేట విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న చైతన్యబాబు

మండపేట: మండపేట ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు గురువారం కళాశాల పీడీ ఈవీవీ సత్యనారాయణ తెలిపారు. ఏలూరులో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో తమ కళాశాల నుంచి ఎల్.త్రిమూర్తులు, ఆర్.రాజు, జి.సంతోష్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన త్రిమూర్తులు, రాజు త్వరలో కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. తిరుపతిలో జరిగిన అండర్ 19 రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఎల్.కామేష్ బాబు 100, 50 మీటర్ల విభాగాల్లో తృతీయస్థానం సాధించి రెండు మెడల్స్‌ను కైవసం చేసుకున్నాడన్నారు. విశాఖపట్నంలో జరిగిన అండర్ 19 రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో అబ్దుల్ రహీం ద్వితీయస్థానం సాధించాడని పీడీ సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగుళ్ల చైతన్యబాబు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అత్తిలి శ్రీనివాస్, లెక్చరర్లు బీఏఆర్ విశ్వనాథమ్, ఇజ్జిన సమర్పణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్



రాయవరంలో యోగి వేమనకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రామచంద్రపురం: యోగి వేమన కేవలం ప్రజా కవి మాత్రమే కాదని భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడని కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్ అన్నారు. యోగి వేమన జయంతిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సోమశేఖరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.ఏసు రత్నం వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీఎస్ఎం కళాశాల సెమినార్ హాల్‌లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ వేమన జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి బహుమతులను అందజేశారు.

యోగి వేమన జయంతి

రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగి వేమన గొప్పదనాన్ని ఎంపీపీ వెంకటరమణ వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జనిపల్లి సుధారాణి, ఏఈ ఈశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

రాయవరం: దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఏఎస్ఐ పి. వెంకటేశ్వరరావు గురు వారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంటూరు గ్రామానికి చెందిన బుల్లిరాజు భార్య ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. రాజమహేంద్రవరం, కాకినాడకు చెందిన ఆవాల దుర్గ, గూడూరి దుర్గలతో బుల్లిరాజుకు పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18న వారిద్దరూ ఇంట్లోకి ప్రవేశించి తనని కొట్టడంతో పాటు పరుష పదజాలంతో తిడుతూ భయభ్రాంతులకు గురి చేశారని బుల్లిరాజు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పి. వెంకటేశ్వరరావు చెప్పారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తాడి సూర్యనారాయణరెడ్డి, కీర్తి మాధురి (ఆలమూరు మండలం జొన్నాడ) గురువారం రూ.51,666 విరాళం సమర్పించారు. అలాగే పి.వెంకట సత్యనారాయణరాజు, కాశీ అన్నపూర్ణ (రావుల పాలెం) రూ.25 వేలు సమర్పించారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు కూడా పాల్గొన్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు పరంశెట్టి మురళీకృష్ణ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు పరంశెట్టి శివ (అల్లవరం మండలం బోడసకుర్రు) రూ.11,516 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

అంబాజీపేట: ప్రతి క్రీడాకారుడూ గెలుపోటములను సమానంగా స్వీకరిస్తేనే భవిష్యత్తులో రాణిస్తారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మాచవరంలో ఐదు రోజులుగా జరుగుతున్న అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. విన్నర్‌గా కుసుమవారిపేట, రన్నర్స్‌గా ఎస్‌వీ కాలనీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కుసుమ సంతోష్ నిలిచారు. విజేతలకు షీల్డ్‌లు, నగదును సర్పంచ్ శాంతకుమారి, సుబ్బారావు దంపతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కుసుమ విజయకుమారి, కె.గుణశేఖర్, కె.బాబి, కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బంగ్లాకు మరమ్మతులు చేపట్టాలి



జగన్నాథగిరిలో శిథిలావస్థలో ఉన్న కాటన్ దొర బంగ్లా

కాజులూరు: కాజులూరు మండలంలోని జగన్నాథగిరిలో ఉన్న చారిత్రక భవనం కాటన్ బంగ్లాకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. 1850–1870 కాలంలో బ్రిటిష్ పాలకులు గెస్ట్ హౌస్‌గా ఈ బంగ్లాను ర్మించుకున్నారు. అనంతరం ధవళేశ్వరం ఆనకట్ట, కాలువల నిర్మాణ పనుల నిమిత్తం ఈ ప్రాంతంలో పర్యటించినపుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు విశ్రాంతి తీసుకోవడానికి ఈ బంగ్లాను అభివృద్ధి చేసుకున్నారు. అప్పట్లో రవాణా సౌకర్యాలు అంతంత మాత్రమే. పంట కాలువల ద్వారా బోటులో ప్రయాణించి కోరంగి కెనాల్ పక్కనే ఉన్న ఈ బంగ్లాకి వచ్చి విశ్రాంతి తీసుకునేవారు. అప్పటి నుంచి అది కాటన్ బంగ్లాగా పేరుగాంచింది. స్వాతంత్ర్యం వచ్చాక ఆ బంగ్లాను ఇరిగేషన్ కార్యాలయంగా మార్చేయడంతో జగన్నాథగిరి సెక్షన్ ఇరిగేషన్ ఆఫీస్‌గా సేవలందిస్తుంది. అయితే శతాబ్దం క్రితమే నిర్మించిన ఈ బంగ్లా గోడలు ఇప్పటికీ పటిష్టంగానే కనిపిస్తున్నా పైకప్పు మాత్రం శిథిలావస్థకు చేరుకుంది. గతకాలపు జ్ఞాపకాలు, భవిష్యత్ తరాల వారు మరిచిపోకుండా ఉండాలంటే శిథిలమవుతున్న బంగ్లాకు అధికారులు మరమ్మతులు చేయించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్‌తో జాబ్‌కార్డుల అనుసంధానం

ఆలమూరు: ఉపాధి హామీ పథకం కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆదేశించారు. ఇన్‌చార్జి ఏపీఓ పి.ప్రసాద్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. జాబ్‌కార్డులున్న వారందరికీ పని కల్పించాలన్నారు. ఆధార్‌తో అనుసంధానం చేయడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు నేరుగా ఉపాధి కూలీలకు దక్కుతాయని చెప్పారు. గ్రామాల వారీగా ఉపాధి పనుల లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి గురించి ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు.